

హైకోర్టు తీర్పు పేదల విజయం

హైకోర్టు తీర్పు పేదల విజయం అని రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు.

వివరాలు 10లో ▸



ఉల్లి ధరకు రెక్కలు

దేవరకద్రలో నిర్వహించిన వేలంలో ఉల్లి క్వింటాల్ రూ.2,140 పలికింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
26.3 /23.2

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ముసురుతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జీపీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలి

నారాయణపేట: గ్రామ పంచాయితీ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్ ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, పీఆర్‌ఏఈలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనుల్లో జాప్యంపై అధికారులను అడిగితెలుసుకున్నారు. ఏమైన ఇబ్బందులు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని చెప్పారు.

14 మంది విద్యార్థులు ఎంపిక

నారాయణపేట: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్స్‌కు జిల్లాకు చెందిన 14 మంది విద్యార్థులు ఎంపికయ్యారని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరంతా జూలై 30న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎంపికలో పాల్గొంటారని తెలిపారు. 4వ తరగతిలో ఎంపికైన వారిలో బాలురు ఉజ్జెలి వినాయక్, ఉప్పర్‌పల్లి హరిచంద్ర, నారాయణపేట సాత్విక్, మక్తల్ వడ్ల హరిశంకర్ ఉన్నారు. బాలికల్లో కొల్లంపల్లి నందిని, అప్పంపల్లి నందిగొండ నీతు, వాడ్వల్ కొత్తోళ్ల గగణసాయి, 5వ తరగతిలో బాలురు వాడ్యాట్ ఉపేంద్ర, కొల్లంపల్లి రవితేజ, దామరగిద్ద చాపలి వినయ్‌కుమార్, అలాగే బాలికల్లో నారాయణపేట శృతి, ఎడివెళ్లి శ్రీవాణి, తిర్మాలాపూరం చందన, దామరగిద్ద దేవేంద్రమ్మ ఉన్నారు.

కాంగ్రెస్ నేతల క్షమాపణకు తీర్మానం



ధన్వాడ /మరికల్: రైతులకు కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పేలా తీర్మానాలు చేయాలని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను తప్పుబడుతూ బుధవారం ధన్వాడ రైతు వేదికలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు రైతుబీమా, రైతుబంధు అందజేస్తుందన్నారు. రైతు అభ్యున్నతి లక్ష్యంగా పని చేస్తున్నదని, దేశానికి అన్నపూర్ణగా మారిందని అన్నారు. జెడ్పీ వైస్‌చైర్మన్ సురేఖరెడ్డి, జిల్లా కోఆప్షన్ వాహిద్ తదితరులు ఉన్నారు.

బంగాళాఖాతంలో కలపాలి..

మరికల్ రైతువేదికలో బుధవారం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఉచిత కరెంట్ ఉండదని, రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తోందని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మాత్రం రైతుల మేలు కోసం పనిచేస్తుందని అన్నారు. రైతులు ఆలోచించి, కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, వైస్‌ఎంపీపీ రవి, సర్పంచ్ రవి, సంపత్, కృష్ణారెడ్డి, గోపాల్, రాజేందర్‌గౌడ్, శేఖర్, రామస్వామి, బాలకృష్ణ ఉన్నారు.

ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లు బదిలీ అయ్యారు. హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ మెదక్ ఆర్డీఓగా బదిలీపై వెళ్లారు. నాగర్‌కర్నూల్ ఆర్డీఓ నాగలక్ష్మి మేడ్చల్ జిల్లాకు బదిలీపై కాగా గద్వాల ఆర్డీఓ వి.రాములు నాగర్‌కర్నూల్ ఆర్డీఓగా బదిలీ అయ్యారు. కొల్లాపూర్ ఆర్డీఓ హనుమానాయక్ మంథని ఆర్డీఓగా వెళ్లగా పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న నాగరాజు కొల్లాపూర్‌కు వస్తున్నారు.

భయం గుప్పిట్లో చదువులు

విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది.. ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన విద్యాలయాలు.. వారి భవితను ప్రమాదాల్లోకి నెట్టేలా మారాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నో పాఠశాలలు శిథిలావస్థకు చేరి.. గదుల్లో పైకప్పు పెచ్చులూడి పడుతూ.. వర్షపు నీరు లీకవుతూ.. ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో ఎప్పుడు కూలిపడతాయో తెలియని పరిస్థితుల్లో ఇటు ఉపాధ్యాయులు.. అటు విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ.. భయాందోళన మధ్య చదువులు సాగిస్తున్నారు.. ఈ నేపథ్యంలో 'సాక్షి' బుధవారం ఉమ్మడి జిల్లాలోని పలు పాఠశాలలను విజిట్ చేయగా భయానక పరిస్థితులే కనిపించాయి..

సాక్షి విజిట్

- మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్

శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో పొంచి ఉన్న ప్రమాదం

- ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు దెబ్బతింటున్న భవనాలు
- ఇప్పటికే మద్దూరులో కూలిన పాఠశాల తరగతి గది పైకప్పు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇదే పరిస్థితి
- 'మన బడి' మొదటి విడతలో నామమాత్రంగా ఎంపిక



వర్షానికి కూలిన మద్దూరులోని బాలికల ఉన్నత పాఠశాల భవనం (ఫైల్)

నారాయణపేట జిల్లా మద్దూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సోమవారం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అయితే పాఠశాలకు సోమవారం సెలవు కావడం, విద్యార్థులు బడిలో లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఒక్క చోటే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నో పాఠశాలలు శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి దాపురించింది. మంగళవారం కూడా ఎడతెరిపి లేకుండా వాన ముసురు కురవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులను మధ్యాహ్నం నుంచే ఇళ్లకు పంపించారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కుస్తున్న నేపథ్యంలో పాఠశాలల నిర్వహణ విషయంలో జాగ్రత్తలు వహించాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రమాదకరంగా..

ఉమ్మడి జిల్లాలోని 3,162 ప్రభుత్వ పాఠశాలల్లో 2 లక్షలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఇందులో కొన్ని శిథిలావస్థకు చేరిన పాఠశాలల్లో పైకప్పు పెచ్చులూడడం, నెర్రెలు రావడంతో వర్షం వచ్చిన ప్రతిసారి తరగతి గదల్లోకి వర్షపు నీరు చేరుతుంది. దీంతో కొన్నిచోట్ల పైకప్పు పెచ్చులు ఊడి పడుతుండగా.. మరికొన్నిచోట్ల భవనాలే కూలిపోతా యా అన్న ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే పలు చోట్ల పైకప్పు పెచ్చులు ఊడిపడగా.. విద్యార్థులు గా యపడటం, త్రుటిలో ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడిన సందర్భాలు లేకపోలేదు. అలాగే కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సైతం ప్రత్యేక గదులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

'మన బడి' పథకంలో..

గతంలో ప్రభుత్వం పాఠశాలల మరమ్మతు, **కొత్త వాటి నిర్మాణా**లకు అనుగుణంగా నిధులు **కేటాయించేది.** అయితే ప్రస్తుతం తెలంగాణ **ప్రభుత్వం 'మన** ఊరు- మన బడి' కార్యక్ర**మంలో భాగంగా** వసతులు కల్పించేందుకు **కొన్ని పాఠశాలలను** మాత్రమే ఎంపిక చేశారు. ఈ క్రమంలో మొదటి విడతగా జోగుళాంబ గద్వాల జిల్లాలో 475 పాఠశాలలు ఉండగా.. 161 స్కూళ్లను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 859 పాఠశాలలకు గాను 291 పాఠశాలల్లో మాత్రమే ఈ కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులోనూ రూ.50 లక్షలోపు పనులు పూర్తయ్యే వాటిని మాత్రమే ఎంపిక చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా మొత్తంగా ఉమ్మడి జిల్లాలో వెయ్యికిపైగా పాఠశాలల్లో 'మన ఊరు- మన బడి' కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మిగతా వాటిని రెండో విడత చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.



బీటలు వారి వర్షం నీరు కురుస్తున్న మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి ప్రాథమిక పాఠశాల భవనం

వణికిస్తున్న బడులు - వివరాలు 8లో ▶

కిట్టు.. రక్తహీనత ఘట్టు!

గర్భిణులకు ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లు అందజేత



మక్తల్ ఆస్పత్రిలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను అందుకున్న గర్భిణులు

- రెండు విడతలుగా పంపిణీకి శ్రీకారం
- రక్తహీనతను అధిగమించడమే లక్ష్యంగా ముందుకు
- జిల్లాలో 1,151 కిట్ల పంపిణీ

జిల్లాలో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ ఇలా..	
జిల్లా ఆస్పత్రిలో 713	కోస్గి ఆస్పత్రిలో 143
మక్తల్ ఆస్పత్రిలో 295	

నర్వ: సర్కారు ఆస్పత్రుల ద్వారా మాతాశిశు మరణాల రేటు తగ్గించడం, ప్రసవాల సంఖ్య పెంచటమే లక్ష్యంగా ప్రభుత్వం గర్భిణులకు పోషకాహార కిట్లు అందిస్తోంది. ఇప్పటికే ఆస్పత్రుల్లో బాలింతలకు కేసీఆర్ కిట్లు, నగదు అందజేస్తున్నారు. మరింత మార్పు తీసుకొచ్చేందుకు గర్భిణులకు కిట్లు అందించడంలో భాగంగా మొదటి విడత ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభించారు. ఇక్కడ ఈ పథకం సత్ఫలితాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లాలో పోషకాహార కిట్ల పంపిణీ గత కొన్నిరోజులుగా ప్రారంభమైంది.

రెండు విడతలుగా పంపిణీ..

జిల్లా ప్రధాన ఆస్పత్రి, మక్తల్, కోస్గి ఆస్పత్రుల పరిధిలోని గర్భిణులకు ఈ పోషకాహార కిట్ల పంపిణీ చేపట్టారు. వీరందరికీ రెండు విడతల్లో పంపిణీకి వైద్యశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 1,151 మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసింది. కొన్నిప్రాంతాల్లో సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో మరణాలు సంభవిస్తున్న పరిస్థితులున్నాయి. ఇలాంటి నేపథ్యంలో గర్భిణులకు పోషకాహారం అందించి రక్తహీనత లేకుండా చర్యలు తీసుకోనున్నారు. గర్భందాల్సిన 13 నుంచి 24 వారాల మధ్య మొదటి కిట్, తరువాత నెల రోజులకు అంటే 28–34 వారాల మధ్య రెండో కిట్ అందజేస్తారు. ఇందులో గర్భిణుల రక్తహీనత శాతం తగ్గించడానికి కిలో పోషకాహార పదార్థాల పాడి(మదర్ హార్లిక్స్) కిలో ఖర్జూర, ఐరన్ సిరప్ 3, నెయ్యి 500 గ్రాములు, అల్బెండజోల్ మాత్రలు, తాగడానికి అవసరమైన కప్పు ఉంటాయి. మొదటి కిట్ బుట్ట రూపంలో ఇస్తే, రెండోది సంచి రూపంలో ఇస్తారు.

రక్తహీనత రావడానికి గల ముఖ్య కారణాలు

1. **పౌష్టికాహార లోపం:** ఐరన్ కలిగిన ఆకు కూరలు (తోట కూర, గోంగూర) బెల్లం, మాంసాహారంలోనూ ఎక్కువ నిల్వలు ఉంటాయి. ఇవి కలిగిన ఆహారం సమతుల్యంతో తీసుకోకపోవడం.
2. **రక్తం నష్టపోవడం:** స్త్రీలు ఋతుస్రావం ద్వారా, పిల్లలు కడుపులో నత్త ద్వారా క్రమేపీ కోల్పోయి రక్తహీనతకు గురవుతారు.
3. **రక్తం తయారీలో అవరోధం:** జబ్బుల వలన ఉదా.. మలేరియా, రక్తంలోని ఎర్రరక్తకణాలు ధ్వంసమై మళ్లీ పెరగవు. దీంతో రక్తం తయారవక రక్తహీనత కనబడుతుంది.

న్యూట్రిషన్ కిట్‌తో ఎంతో ప్రయోజనం

ప్రభుత్వం గర్భిణులకు పోషకాహార కిట్లు పంపిణీ చేయడం వల్ల రక్తహీనతను అధిగమిస్తాం. వైద్యులు కాన్పు కంటే ముందు నుంచి రక్తపరీక్షలు చేసి, రక్తం బాగుండాలని సూచనలు ఇస్తున్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని చెబుతున్నారు. రక్తహీనతను అధిగమించేందుకు న్యూట్రిషన్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని ఉచితంగా అందిస్తున్నారు.

– సంధ్య, గర్భిణి, కల్వాల గ్రామం

రక్తహీనతను అధిగమించేందుకు..

జిల్లాలో గర్భిణులకు న్యూట్రీషన్ కిట్ల పంపిణీని కార్యక్రమం చేపట్టాం. ఈ కిట్లతో గర్భిణులకు పోషకాహారం అందుతోంది. మే నెల నుంచి ఈ పథకం అమలవుతోంది. వైద్యుల సూచనలు పాటిస్తే గర్భిణులు రక్తహీనతను అధిగమించి ఆరోగ్యంగా ఉండవచ్చు. దీనివల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సకాలంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి.

– డా.రంజిత్‌కుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

రక్తహీనత వల్ల దుష్పరిణామాలు

బలహీనత, గర్భస్రావం, తక్కువ బరువుతో బిడ్డ పుట్టడం, పుట్టిన బిడ్డ లేదా తల్లి చనిపోవడం, పనిచేసే సామర్థ్యం తగ్గుదల తదితర పరిణామాలు జరుగుతాయి.

రక్తహీనత వల్ల కలిగే నష్టాలు..

రక్తహీనత అనేది శరీరలో రక్తం తక్కువగా ఉండట ద్వారా వచ్చే వ్యాధి. ఇది ఎక్కువగా మంచి బలమైన ఆహారం తీసుకోకపోవడం వల్ల వస్తుందని వైద్యులు చెబుతున్నారు. చిన్న పిల్లలు, గర్భిణులు, మలేరియా లాంటి తీవ్ర జ్వరాలు, వ్యాధులు కలిగిన వారిలో ఈ రక్తహీనత ఎక్కువగా కనిపిస్తుంది.

చికిత్స విధానం:

స్త్రీలలో యుక్త వయస్సు నుంచి సంతానం పొందు వయస్సు వరకు వీరికి ఏఎస్‌ఎం సహాయంతో ఉచితంగా లభ్యం అయ్యే ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలి.

ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలి



విద్యాధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రెండో తరగతి నుంచి 7వ తరగతి వరకు విద్యార్థులందరికీ అమలుపరుస్తున్న వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ ప్రణాళికబద్ధంగా బోధన చేస్తూ అభ్యాసమిత్ర వర్క్‌బుక్‌లను సమయానుసారం పూర్తి చేయించాలని కలెక్టర్ శ్రీహర్ష విద్యాధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లాలోని మండల ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారులు, మానిటరింగ్ డీఆర్పీలు, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులతో వెలుగు అభ్యాసమిత్ర కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. 45 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా అమలుచేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు మొదటి 45నిమిషాలు ప్రణాళికాబద్ధంగా బోధన తర్వాతి 45 నిమిషాలు వర్క్‌బుక్కుల సాధనను చిత్తశుద్ధితో చేయాలని కోరారు. మొదటి 45 నిమిషాల తరగతి గది బోధనలో వర్క్‌బుక్‌ల వినియోగంలో ఎదురవుతున్న సవాళ్లను సంబంధిత నోడల్ అధికారులు 90 నిమిషాలు తరగతిని పరిశీలించాకే తగు సహాయక సూచనలు ఇవ్వాలన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా రెండు పాఠశాలలు సందర్శించాలన్నారు. జిల్లాలోని రెండు, మూడో తరగతులకు లెవెల్ వన్, 4, 5తరగతులకు వరకు లెవల్ 2, ఆరు, ఏడు తరగతులకు లెవెల్-3 వర్క్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో అమలుపరుస్తున్న ప్రత్యేక కార్యక్రమం వెలుగు అభ్యాసమిత్రను ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. టీచర్ హ్యాండ్ అవుట్ వాడకుండా కేవలం వర్క్ బుక్‌నే బోధిస్తున్నట్లు సంబంధిత నోడల్ అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వర్క్‌బుక్‌ను విద్యార్థి స్వతహాగా పూర్తి చేసేలా సీ-గ్రేడ్ విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని, ప్రతిరోజు వాట్సప్ ద్వారా పంపే సబ్జెక్టు వారీ సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ వెలుగు కార్యక్రమాన్ని అమలుపరచాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా రెండో తరగతి నుంచి ఏడవ తరగతుల విద్యార్థులందరికీ వర్క్ బుక్కులు రాసుకునేందుకు రెండు నోట్ పుస్తకాలు ప్రత్యేకంగా అందించడం జరిగిందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారులు నాగార్జునరెడ్డి, పద్మనళిని, ఎంఈఓలు, మండల ఎఫ్ఎల్ఎన నోడల్ అధికారులు, డీఆర్పీలు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఓటరు నమోదు

మక్తల్: గ్రామాల్లో ప్రతి ఒక్క బీఎల్ఓలు ఓటర్ నమోదు ప్రక్రియ తప్పులు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ మాయంక్ మిట్టల్ అన్నారు. బుధవారం మక్తల్ ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్ఓలకు ప్రత్యేకంగా ఓటర్ నమోదు కార్యక్రమంపై శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈశిబిరంలో ఆయన మాట్లాడారు. ఓటరు నమోదు చేసుకునేందుకు ఫారం-6 లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఫారం నంబర్-7లో ఓటర్ మృతి చెందితే డెత్ సర్టిఫికెట్ ఆధారంగానే ఇంటి యజమానులకు సమాచారం అందించి తొలగించాలని అన్నారు. ఫారం నంబర్-8 ఓటర్ అడ్రస్ మార్పు చేసుకునేందుకు అవసరం ఉంటుందని అన్నారు. ప్రతి ఇంటి దగ్గరకు వెళ్లి ఇంటి యజమానులతో వివరాలు తెలుసుకోవాలని అన్నారు. ఎలక్షన్‌లో బీఎల్ఓలు పని చేయాలని అన్నారు. రాజకీయంగా వెళ్లకుండా పని చేయాలని చెప్పారు. అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, విద్యార్థులకు వండిన భోజనాలను పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన డబ్బాలను తొలగించాలని తహసీల్దార్ తిరుపతయ్యను ఆదేశించారు. అక్కడే ట్రెజరీ కార్యాలయంలోకి వెళ్లి రికార్డులను పరిశీలించారు. అనంతరం లింగంపల్లి పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.



మక్తల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్



మొక్కలకు రక్షణ ఏదీ?

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని యాద్గీర్ రోడ్డులో డివైడర్‌పై నాటిన మొక్కలకు రక్షణ కరువైంది. ట్రీగార్డు ఏర్పాటు చేయకపోవడంతో ఆ దారిలో వెళ్తున్న మేకలు, హరితహారంలో నాటిన మొక్కలను తింటున్నాయి.

బాల్యవివాహాలను అరికట్టాలి

రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు దేవయ్య



మాట్లాడుతున్న దేవయ్య

నారాయణపేట: బాల్యవివాహాలను అరికట్టాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యుడు దేవయ్య అన్నారు. బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో బాలల హక్కుల పరిరక్షణ అంశాలపై ఓరియంటేషన్ కమ్ సెన్సిటిజషన్ ప్రోగ్రాం ఆన్‌చైల్డ్ రైట్స్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. పోక్సో కేసుల విషయంలో ఎంతో సున్నితంగా ఉండాలన్నారు. పోక్సో కేసులపై సీరియస్‌గా ఉంటుందని పీఎస్‌లలో వారికి రక్షణ కల్పించాలన్నారు. ప్రొటెక్షన్, ప్రాసిక్యూషన్ అనే అంశాలపై పోలీసులు ఫోకస్ చేయాలన్నారు. జిల్లా మ్యాపింగ్ తీసుకొని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సక్సెస్ స్టోరీపై పిల్లలకు గెట్ టుగెదర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ హాస్టళ్లను చక్కగా నిర్వహించాలని ఎస్సీ అధికారికి ఆదేశించారు. అదేవిధంగా డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్ దేశ భవిష్యత్ గర్వపడేలా అధికారులు పనిచేస్తున్నట్లు తెలిపారు. పోక్సో చట్టం ద్వారా కేసులు నమోదు చేసి చార్జీషీట్ వేస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. షీటీమ్స్ ద్వారా కళాశాలల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ అశోక్‌శ్యామల మాట్లాడుతూ సీడబ్ల్యూసీ కమిటీ పరిధిలో 675 కేసులు నమోదైనట్లు తెలిపారు. డీడబ్ల్యూఓ వేణుగోపాల్ మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టడానికి 24గంటలు పని చేస్తున్నట్లు తెలిపారు. పోలీసు శాఖ సహాయంతో 300 మంది పిల్లలను గుర్తించి, వారిని గురుకుల పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ ప్రోగ్రాం, షీటీ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వస్తున్నట్లు తెలిపారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ బాలబాలికల ఆరోగ్య పరిస్థితులను తన సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు. జిల్లాలోని 704 అంగన్‌వాడీ కేంద్రాల్లో 50,276 మందిలో బాలికలు 24,823 , బాలురు 25,453 ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు. జిల్లాలో నార్మల్ డెలవరీలలో మొదటిస్థానంలో ఉందని డీఎంహెచ్ఓ అన్నారు. టీఎస్‌సీపీసీఆర్ కమిటీ సభ్యులు దేవయ్య సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు, అధికారులు ఉన్నారు.



ఇది నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పరిస్థితి. చాలా ఏళ్లుగా తరగతి గదులు, వరండాలు శిథిలావస్థలో ఉన్నాయి. 8, 10వ తరగతి గదుల పైకప్పులు పెచ్చులూడుతున్నా అందులోనే విద్యార్థుల చదువు సాగుతోంది. పైకప్పు పెచ్చులూడి మీద పడతాయోనని విద్యార్థులు భయంతో ఉన్నారు. – పెంట్లవెల్లి



నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని కొమ్మూరు పాఠశాల గదులు వర్షాలకు పెచ్చులూడుతున్నాయి. దీంతో విద్యార్థులు వరండాలోనే చదువుకుంటున్నారు. పాఠశాలలో 107 మంది విద్యార్థులున్నారు. ఒకే గదిలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు ఉన్నారు. – మద్దూరు



నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలోని సాయినగర్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతభవనం శిథిలావస్థకు చేరింది. పాత గదులు కావడంతో పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. పాఠశాలలో 430 మంది విద్యార్థులున్నారు. – అచ్చంపేట రూరల్

వణికిస్తున్న బడులు

బడి ఖాళీ

అడ్డాకుల మండలం కందూర్ ప్రాథమిక పాఠశాలలో రెండు, మూడేళ్లుగా భవనం పైకప్పు నుంచి పెచ్చులూడుతున్నాయి. ఆరు నెలల తర్జనభర్జన తర్వాత గత విద్యా సంవత్సరం ఏప్రిల్ రెండో వారంలో బడిని ఖాళీ చేసి హైస్కూల్‌కు మార్చారు. ఈ ఏడాది పాఠశాలలు మొదలైనప్పటి నుంచి పాఠశాలను హైస్కూల్‌లోనే కొనసాగిస్తున్నారు. అక్కడ ఐదు తరగతులకు 95 మంది విద్యార్థులు చదువుకుంటుండగా వారికి తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. – అడ్డాకుల



వర్షం వస్తే ఇంటికే..

మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి, తిరులాపూర్ గ్రామాల ప్రాథమిక పాఠశాలలను ఉదయం 10 గంటలకు సాక్షి విజిట్ చేసింది. ఉప్పర్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 83 మంది విద్యార్థులు ఉండగా.. నలుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. రెండు గదుల్లోనే ఐదు తరగతులు కొనసాగిస్తున్నారు. వర్షం వస్తే చాలు ఒక గదిలోకి వర్షం నీరు వచ్చి చేరుతుంది, మరో గది గోడలకు తేమ వచ్చి పెచ్చులు ఊడిపోతున్నాయి. తిరుమలాపూర్ ప్రాథమిక పాఠశాలల్లో 55 మంది విద్యార్థులు ఉన్నారు. గదిలో పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం నీరు చేరి విద్యార్థులు ఇంటికి వెళ్లిపోతున్నారు.ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. – మక్తల్



ఉప్పర్‌పల్లి వరండాలో వర్షం నీరు రావడంతో గోడకు కూర్చున విద్యార్థులు



భయం భయంగా..

అలంపూర్ మున్సిపాలిటీలోని న్యూప్లాట్స్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో తరగతి గది గోడపై పగుళ్లు ఏర్పడ్డాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు మొత్తం 102 మంది విద్యార్థులు భయంభయంగా విద్యనభ్యసిస్తున్నారు. పురాతన భవనాలు కావడంతో గోడలకు పగుళ్లు ఏర్పడటం, పైకప్పు పెచ్చులూడడం, వర్షాలకు తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరుతోంది. దీంతో పాఠశాలకు పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. – అలంపూర్

పెచ్చులూడుతున్నాయ్..



గంజిపేటలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితి..



అంగన్‌వాడీలో ఒకే గదిలో 4, 5 తరగతులు

గద్వాల పట్టణంలోని గంజిపేట కాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయి. అదే కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో 4, 5 తరగతులకు చెందిన 55 మంది విద్యార్థులకు ఒకే గదిలో బోధన చేస్తున్నారు. 1–3 తరగతులను సమీపంలో కమ్యూనిటీ హాల్లో, పాఠశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. పట్టణంలోని మోమిన్ మహెల్లాలో ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో 6–10తరగతులు నిర్వహిస్తున్నారు. గదుల కొరత వల్ల బయట వరండాలో కూర్చోబెట్టి విద్యార్థులను చదివిస్తున్నారు. బయట పైకప్పు సీలింగ్ కొంత ధ్వంసమైంది. ఎంబీ పాఠశాలలో గోడలకు పగుళ్లు ఏర్పడి నీటి తేమ వస్తోంది. – గద్వాల అర్బన్



అటెన్షన్ ప్లీజ్

బిక్కు బిక్కుమంటూ..



గట్టు దళితవాడ ప్రాథమిక పాఠశాల, బాలుర ప్రాథమిక పాఠశాల, గంగిమాన్‌దొడ్డి, సల్కాపురం, చమన్‌ఖాన్‌దొడ్డి, ఇందువాసి, బల్గెర, బింగిదొడ్డి తండాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ఒక్కోక్క గది శిథిలావస్థకు చేరుకుంది. గంగిమాన్‌దొడ్డిలో గదిపై కప్పు పెచ్చులూడి ఇనుప చువ్వలు కన్పిస్తున్నా, అ గదిలోనే బోధన సాగిస్తుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుకుంటున్నారు. – గట్టు

30 ఏళ్ల క్రితం నిర్మాణం..



ఒకే గదిలో చదువుకుంటున్న విద్యార్థులు



హరిజనవాడ పాఠశాలలో పెచ్చులూడిన గది పై కప్పు

దేవరకద్ర హరిజనవాడ ప్రాథమిక పాఠశాల 30 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు లేక శిథిలావస్థకు చేరింది. గదుల పైకప్పు, బీమ్‌ల పెచ్చులూడి, కిటికీ రెక్కలు విరిగిపోయాయి. వారండాలో పైకప్పు పెచ్చులూడి వర్షం పడితే కురుస్తోంది. హెచ్‌ఎం గదిలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఐదు తరగతులకు హెచ్‌ఎం గదే దిక్కయింది. ఒకటి, రెండు తరగతులకు హరిజనవాడలో మరో గదిని కేటాయించినా, విద్యార్థులు అక్కడి వెళ్లకుండా ఇక్కడే చదువుకుంటున్నారు. మన ఊరు మన బడి పథకం కింద నూతన భవన నిర్మాణానికి రూ. 41 లక్షలు మంజూరయ్యాయి. టెండర్ తీసుకున్న కాంట్రాక్టర్ నిధులు సరిపోవని పనులు ప్రారంభించలేదు. 130 మంది విద్యార్థులున్న పాఠశాలలో ఇప్పుడు కేవలం 90 మంది విద్యార్థులు మాత్రమే వస్తున్నారు. – దేవరకద్ర

4గదులు శిథిలావస్థలో..



మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం కుచ్చర్‌కల్ ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరి కూలడానికి సిద్ధంగా ఉంది. వర్షపునీరు తరగతి గదుల్లోకి చేరి చిత్తడిగా మారాయి. ఏడు తరగతుల్లో 74 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగు గదులు శిథిలావస్థలో ఉన్నాయి. – రాజాపూర్

నిధుల్లేక నిర్లక్ష్యానికి గురి..



జడ్చర్ల పాతబజార్ హరిజనవాడ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. భవనం ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో నాలుగు తరగతి గదుల్లో మూడు పైకప్పులు కారుతుండడంతో ఒక గదిలో బోధన కొనసాగుతోంది. రెండు రోజుల క్రితం గది పైకప్పు పెచ్చులూడి ఉపాధ్యాయురాలికి ప్రమాదం తృటిలో తప్పింది. – జడ్చర్ల టౌన్



కూలిపోయే స్థితిలో..

దేవరకద్ర మండలంలోని గద్దెగూడెం ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. నాలుగు గదుల్లో రెండు గదులు పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉన్నాయి. పాఠశాలలో మొత్తం 121 మంది విద్యార్థులుండగా, నాలుగు గదుల్లో 7 తరగతుల విద్యార్థులకు బోధన చేస్తున్నారు. – దేవరకద్ర రూరల్



వెల్దండ మండలం గుండాలలో శిథిలావస్థలో ఉన్న పాఠశాల తరగతి గదులు



వెల్దండ మండలం చెర్కూర్ పాఠశాలలో పెచ్చులూడిన పైకప్పు

అసంపూర్తిగా పనులు..



తరగతి గది గోడ పరిస్థితి..



పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న సంపు

మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ ఉన్నత పాఠశాలలో సంపుకోసం తవ్విన గుంత ప్రమాదకరంగా మారింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల డైనింగ్ హాల్ నిర్మాణం పునాదులకే పరిమితమైంది. మధ్యాహ్న భోజనానికి విద్యార్థులు వర్షంలోనే నిలబడాల్సి వస్తోంది. పాఠశాలలో 420 మంది విద్యార్థులున్నారు. 9వ తరగతి బి సెక్షన్‌లో 52 మంది ఉంటారు. గదిలో కొంతబాగం ఫాల్ సీలింగ్ ఊడిపోవడంతో నీరు కారుతోంది. – గండేడ్

వరండాలోనే ఇంకుడుగుంత..

గాధిర్యాల్ ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతి గదిముందు వరండాలో ఇంకుడుగుంత తవ్వడంతో ప్రమాదకరంగా మారింది. చౌదర్‌పల్లి ప్రాథమిక పాఠశాల గదుల్లో గోడలు తడిసి నీరు కారుతోంది. కప్పు పెచ్చులూడుతున్నాయి. వేరే గదులు లేక అదే గదుల్లో విద్యార్థులు చదువుకోవల్సి వస్తోంది. – మహమ్మదాబాద్



కూలేందుకు సిద్ధం..



ముసురు వర్షంతో నారాయణపేట జిల్లా నర్వ ఉన్నత పాఠశాల కూలడానికి సిద్ధంగా ఉంది. విద్యార్థులు తరగతి గదిలో కూర్చోవడానికే భయపడుతున్నారు. మన ఊరు–మనబడిలో పాత భవనం మరమ్మతుకు నిధులు మంజూరైన పనులు పూర్తి కాలేదు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పాత భవనం డిస్‌మెటల్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్‌ఎం రాజేష్‌కుమార్ తెలిపారు. – నర్వ



భయపడుతూనే పంపిస్తున్నాం..



నాకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. వారిని ఇంటి దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్న. భవనం పెచ్చులూడి శిథిలావస్థకు చేరడం వల్ల భయపడుతూనే పిల్లలను పాఠశాలకు పంపిస్తున్నాం. కొత్త భవనం నిర్మిస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది.

– రాజు, హరిజనవాడ, దేవరకద్ర

పట్టించుకోవడంలేదు...



పాఠశాల శిథిలావస్థకు చేరింది. 83 మంది విద్యార్థులకు రెండే గదులు ఉన్నాయి. వర్షం వస్తే నీరు వచ్చి చేరుతుంది. వంటగది లేక వాటర్‌ట్యాంకులు లేవని పాఠశాల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి అదనంగా మరో గదిని మంజూరు చేయాలి.

– నర్సింహ, ఉప్పర్‌పల్లి, మక్తల్ మండలం

గదుల్లోకి వర్షం నీరు..



పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడుతున్నారు. గది గోడలు నెర్రలిచ్చి వర్షం నీరు తరగతి గదిలోకి వస్తున్నాయి. వెంటనే అదనపు గది నిర్మాణం చేసేందుకు చర్యలు చేపట్టాలి. విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా సందర్శించి నిధులు మంజూరు చేయాలి

– మనోజ్, ఉప్పర్‌పల్లి, మక్తల్ మండలం

ఎప్పుడు కూలుతుందో..

పాఠశాలకు పంపాలంటే భయమోస్తోంది. మా ఇద్దరు పిల్లల్ని గ్రామంలోని సర్కారు బడికి పంపిస్తున్న. తరగతి గది పరిస్థితి చూస్తుంటే ఎప్పుడు కూలుతుందోనన్న భయం వెంటాడుతోంది. పాఠశాలకు నూతన గదులు నిర్మించాలని కోరుతున్నాం.

– శ్రీశైలం, కుచ్చర్‌కల్, రాజాపూర్ మండలం

గదుల కొరత ఉంది..



గుండాల ప్రాథమిక పాఠశాలలో గదుల కొరత వేధిస్తోంది. ఉన్న గదులు శిథిలావస్థకు చేరడంతో ముసురు వానలకే పడిపోయే స్థితిలో ఉన్నాయి. మన ఊరు–మన బడిలో ఎంపికైనా మరమ్మతులు చేయడంలో ఆలస్యం అవుతోంది. అధికారులు చర్యలు తీసుకొని పనులు వేగంగా పూర్తి చేయాలి.

– శ్రీను, గుండాల, వెల్దండ మండలం

నిర్లక్ష్యంగా వదిలేశారు...



సంపు కోసం తవ్విన గుంతను అర్ధాంతరంగా వదిలేశారు. ఆరు నెలలు గడుస్తున్నా పనులు చేయకపోవడంతో అది ప్రమాదకరంగా మారింది. ఇటీవల ఓ కుక్క పడి బయటికి రావడానికి వీలు లేక చనిపోయింది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గిరమోని ఆంజనేయులు, విద్యార్థి తండ్రి, చెన్నాయిపల్లి, గండేడ్ మండలం

పెచ్చులూడి నెత్తిపై పడుతున్నాయి..



మాది బొమ్మన్‌పల్లి గ్రామం. పాఠశాలలో మంచి ఫలితాలొస్తున్నాయి. హాస్టల్ ఉంటూ పాఠశాలలో చదువుతున్నాం. నేను చదువుతున్న ఆరో తరగతి గది శిథిలావస్థకు చేరడం వల్ల పెచ్చులూడి నెత్తిపై పడుతున్నాయి. బిక్కుబిక్కుమంటూ చదువుతున్నాం.

– వైష్ణవి, ఆరో తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అచ్చంపేట

ఫ్రెండ్‌తో వీడియో కాల్ మాట్లాడుతూ

యువకుడి బలవన్మరణం



నరేంద్ర మృతదేహం

శాంతినగర్: ఫ్రెండ్‌తో వీడియో కాల్ మాట్లాడుతూ ఓ యువకుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. శాంతినగర్‌కు చెందిన బోయ పద్మ కుమారుడు నరేందర్(18) గత మూడేళ్లుగా మతిస్థిమితం సరిగా లేకుండా ప్రవర్తిస్తున్నాడు. అప్పుడప్పుడు చనిపోతా అంటూ చెబుతుండేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్రెండ్‌కు వీడియో కాల్ చేసి చీరతో ఉరేసుకుంటూ మృతిచెందాడు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై నరేందర్ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అయితే యువకుడి మృతికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావి గేటు వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. తుర్కపల్లికి చెందిన రాగం పర్వతాలు(38) అచ్చంపేట నుంచి జీపులో వచ్చి వెంకటేశ్వర్లబావి గేటు వద్ద దిగి తుర్కపల్లి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే మార్గం నుంచి దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మద్దిమడుగు వెళ్తూ.. జీపు ముందు నుంచి వచ్చిన పర్వతాలును గమనించక అతి వేగంతో బస్సు ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని హుటాహుటిన అ చ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతదేహంతో వెనుదిరిగి ప్రమాదం జరిగిన గేటు వద్దనే బంధువులు, సమీప గ్రామాల ప్రజలు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో చేపట్టారు. మృతుడికి భార్య పార్వతమ్మతో పాటూ ఇద్దరు కుమారులు ఉన్నారు. రాస్తారోకో చేస్తున్న క్రమంలో మరోదారి లేకపోవడంతో ఇరువైపుల వాహనాలు నిలిచిపోయి ప్రయాణాలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అమ్రాబాద్, ఈగలపెంట పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి అక్కడి పరిస్థితులను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

వ్యక్తి రిమాండ్

మిడ్జిల్: మండల కేంద్రంలోని సహకార సంఘంలో 2020లో చోరీ కేసులో తప్పించుకు తిరుగుతున్న కర్నూల్ జిల్లాకు చెందిన షేక్ దస్తగిరిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా అతను తప్పించుకొని తిరుగుతుండడంతో అరెస్టు వారెంట్ జారీ అయింది. బుధవారం ఉదయం మిడ్జిల్ పోలీసులకు కన్పించడంతో అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గోవా మద్యం పట్టివేత

కృష్ణా: మండల సరిహద్దులోని చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎక్సైజ్ చెక్‌పోస్టు అధికారులు వాహనాలు తనిఖీ చేసి గోవా మద్యం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం.. సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఓ వ్యక్తి గోవా నుంచి తీసుకొచ్చిన 08 బాటిళ్ల మద్యం పట్టుకున్నారు. నిందితున్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రయాణికులు గోవా నుంచి మద్యాన్ని మన రాష్ట్రంలోకి తీసుకొస్తే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు.ఈ తనిఖీలో ఎస్‌ఐ కవిత, సిబ్బంది మల్లన్‌గౌడ్, భాషా, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెలు మృతి

కోడేరు: విద్యుదాఘాతంతో మూడు పాడి గేదెలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని బావాయిపల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. బావాయిపల్లిలో పశువుల మంద(జంగిడి)ను కాపరి మేత కోసం వ్యవసాయ పొలాలకు తీసుకెళ్లాడు. ఈదురు గాలులకు వ్యవసాయ పొలంలో తెగిపడిన విద్యుత్ తీగలను మూడు పాడి గేదెలుతాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. దీన్ని గమనించక కాపరి మిగతా పశువులను ఊర్లోకి తీసుకెళ్లాడు. పాడి గేదెలు ఇళ్లకు రాకపోవడంతో యజమానులు స్వామి, పార్వతమ్మ, బక్కయ్యలు ఊర్లో, చుట్టు పక్కల వెతికారు. అయినా వాటి ఆచూకీ కనిపించలేదు. బుధవారం ఓ రైతు వ్యవసాయ పొలంలో మృత్యువాత పడిన పాడి గేదెలను చూసి బాధిత రైతులకు సమాచారం ఇచ్చాడు. వాటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు.

24 నుంచి 'గురుకుల' హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: గురుకుల కొలువులకు అర్హత పరీక్షల సమయం ఆసన్నమైంది. ఆగస్టు 1 నుంచి ఆన్‌లైన్ పరీక్షలను నిర్వహించేందుకు తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) ఏర్పాట్లు ముమ్మరం చేసింది. తొలి పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈనెల 24 నుంచి టీఆర్ఈఐఆర్‌బీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని బోర్డు కన్వీనర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.


టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు..

పరీక్షల టైమ్‌టేబుల్‌లో స్వల్ప మార్పులు చేసి, సవరించిన పరీక్షల షెడ్యూల్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టింది. ఇదివరకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిర్వహించాల్సి ఉండగా... తాజాగా వెల్లడించిన తేదీల ప్రకారం పరీక్షలు ఆగస్టు 1వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలు రోజుకు మూడు సెషన్లలో జరుగుతాయి. ఉదయం 8.30గంటల నుంచి 10.30గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2.30గంటల వరకు రెండో సెషన్, సాయంత్రం 4.30గంటల నుంచి 6.30గంటల వరకు మూడో సెషన్ జరుగుతుంది.

'నో క్యాస్ట్.. నో రిలీజియన్ కాలమ్ చేర్చాలి'

సాక్షి, హైదరాబాద్: విద్యతో పాటు ఇతర అన్ని దరఖాస్తుల్లో 'నో క్యాస్ట్', 'నో రిలీజియన్' అనే కాలమ్‌ను తప్పకుండా చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కులాన్ని, మతాన్ని వదులుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ఆ స్వేచ్ఛను అడ్డుకోవడం సరికాదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉత్తర్వులను వెలువరించింది. తమ కుమారుడికి నో క్యాస్ట్.. నో రిలీజియన్ సర్టిఫికెట్ ఇవ్వాలని 2019లో సండెపు స్వరూప పలుమార్లు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో స్వరూపతో పాటు మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై వాదనలు విన్న జస్టిస్ కన్నెగంటి లలిత ఉత్తర్వులు జారీ చేశారు. 'పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించడం రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తికి విరుద్ధం. ఆర్టికల్ 14,19,21,25ను ఉల్లంఘించడమే అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కింద మత స్వేచ్ఛతో పాటు ఇలాంటి కొన్ని హక్కులు పౌరులకు ఉన్నాయి. ఏ మతాన్ని, కులాన్ని ఆచరించకూడదని ఎంచుకునే హక్కు పౌరులకు ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ఇదే చెబుతోంది. నో క్యాస్ట్.. నో రిలీజియన్ అనే కాలాన్ని అన్ని దరఖాస్తుల్లో (ఆన్‌లైన్‌లోనూ) చేర్చాలని మున్సిపల్ కమిషనర్లకు, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా ఆదేశాలు జారీ చేస్తున్నాం' అని తీర్పులో పేర్కొన్నారు.

మళ్లీ లేఆఫ్స్



డౌన్ ట్రెండ్‌లో ఐటీ సెక్టార్
2022తో పోల్చితే 2023 తొలి 6 నెలల్లో అధికం
లేఆఫ్స్.ఎఫ్‌వైఐ సర్వే నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: లేఆఫ్స్ పెరుగుదలతో టెకీలకు మళ్లీ కష్టాలు మొదలయ్యే పరిస్థితి కనిపిస్తోంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా టెకీల ఉద్వాసన పర్వం ఉధృతమవుతోంది. అమెరికా, ఐరోపాతో పాటు పలు దేశాల్లో ద్రవ్యోల్బణపెంపుతో ఐటీ, ఇతర కంపెనీల లాభాలు తగ్గిపోయాయి. ఆర్థికరంగ ఒడిదొడుకుల కారణంగా స్టార్టప్‌లలో పెట్టుబడుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుముఖం పట్టిందని నిపుణులు చెబుతున్నారు.

➤ ఆరునెలల్లోనే 2,13,020 మంది టెకీలకు ఉద్వాసన 2023లో (జనవరి నుంచి జూన్) ప్రపంచవ్యాప్తంగా 2,13,020 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ వెబ్‌సైట్ తాజా నివేదిక వెల్లడించింది. గతేడాది 45,166 టెకీలు ఉద్యోగాలు కోల్పోగా, ఈ ఆరునెలల్లో ఉద్యోగుల లేఆఫ్‌ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఉద్యోగులను తొలగించిన జాబితాలో అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాహూ, మెటా, జూమ్ ఉన్నాయి.

➤ భారత్‌లోనూ ఇంచుమించు ఇదే పరిస్థితులు ఉన్నాయి. మన దగ్గర ఈ ఏడాది జనవరి నుంచి జూన్ దాకా 10,774 మంది టెకీలను తొలగించినట్టు లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక వెల్లడించింది. 2022లో ఉద్వాసనకు గురైన టెకీ ఉద్యోగుల సంఖ్య 6,530. ఈ ఏడాదితో పోల్చి చూసినప్పుడు తొలి ఆరునెలల్లో టెక్నాలజీ రంగంలో పనిచేస్తున్నవారే అధికంగా ఉద్యోగాలు కోల్పోయారు.


➤ కోవిడ్ విజృంభించిన 2020లోనూ భారత్‌లోని 12,932 మంది టెకీలు ఉద్యోగాలు కోల్పోయారు. 2021లో కొత్త స్టార్టప్‌లకు ఫండింగ్ పెరిగింది. దీంతో ఈ సంఖ్య 4,080కు తగ్గింది.

బెంగళూరు టాప్

టెకీల తొలగింపులో భారత్‌లో బెంగళూరు మొదటి వరుసలో ఉంది. ఇతర నగరాలతో పోలిస్తే అక్కడ 6,967 మంది ఉద్యోగాలు కోల్పోయారు. స్టార్టప్ హబ్‌గా రూపొందుతున్న క్రమంలో ఈ ప్రభావం అధికంగా పడినట్టు నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో లేఆఫ్‌లు పెద్దగా లేకపోవడంతో లేఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదికలో టెకీ ఉద్యోగుల తొలగింపునకు సంబంధించిన గణాంక వివరాలు పొందుపరచలేదు.


బెంగళూరు	ముంబై	గురుగ్రామ్
6,967	1,410	1,105
న్యూఢిల్లీ 487	చెన్నై 400	

లే ఆఫ్స్.ఎఫ్‌వైఐ నివేదిక ప్రకారం భారత్‌లో గత రెండేళ్లలో (6 నెలల్లో) లే ఆఫ్‌ల తీరిది..



లేఆఫ్స్.ఎఫ్‌వైఐ గణాంకాల ప్రకారం 2023 తొలి ఆరునెలల్లో భారత్‌లో వివిధ రంగాల్లో 10,774 మంది తమ ఉద్యోగాలు కోల్పోయారని తన నివేదికలో పొందుపరిచింది.

వివిధ రంగాల వారీగా చూస్తే...



ఇప్పుడు స్టార్టప్‌లదీ వ్యథే...

గత శీతాకాలం నుంచి ఇప్పటిదాకా 107 ఇండియన్ స్టార్టప్‌లలో 28,046 మంది ఉద్యోగులకు లే ఆఫ్ సెగ తాకినట్టు ఐఎన్‌సీ 42 తాజా నివేదిక వెల్లడించింది. ఏడాది కాలంలో 22 భారత ఎడ్‌టెక్ స్టార్టప్‌లు 9,871 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికాయని, 59 స్టార్టప్‌లు 9,271 మంది ఉద్యోగులను తొలగించినట్టు పేర్కొన్నారు.



ఆ ఏడాది చివరి దాకా తప్పదు

ప్రస్తుత పరిస్థితులు గమనిస్తే ప్రపంచవ్యాప్తంగా ఐటీ సెక్టార్ డౌన్‌ట్రెండ్‌లోనే ఉందని చెప్పాలి. టెకీల లేఆఫ్ చేసే పరిస్థితులు ఈ ఏడాది చివరిదాకా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గ్లోబల్ ఎకానమీ ఎఫెక్ట్ కారణంగా ఆర్థికరంగ పరిస్థితి బాగా లేకపోవడంతో అమెరికాతో సహా ఇతరదేశాలు ప్రభావితమవుతున్నాయి. ఐటీ ఎనబుల్డ్ సర్వీసెస్‌పై ఈ ప్రభావం ఎక్కువగా ఉండగా, భారత్‌లోనే కొంత ప్రభావం తక్కువగా కనిపిస్తోంది. పాత టెక్నాలజీపై పనిచేస్తూ, పనితీరు బాగాలేని వారికి ఉద్వాసన పలికేందుకు దీనిని కంపెనీలు ఒక అవకాశంగా తీసుకున్నాయి. ఈ పరిస్థితుల ప్రభావం స్టార్టప్‌లపై తీవ్రంగా పడింది.

- రమణ భూపతి, క్వాలిటీ థాట్ గ్రూప్ చైర్మన్, ఎడ్‌టెక్ కంపెనీ

ప్రముఖ రచయిత శ్రీరమణ కన్నుమూత





మణికొండ: ప్రముఖ కథకుడు, వ్యంగ్య వ్యాసరచయిత, సినిమాగా వచ్చిన మిథునం కథా రచయిత, సీనియర్ జర్నలిస్టు శ్రీరమణ (71) బుధవారం ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ ఫ్లోటిల్లా గెటెడ్ కమ్యూనిటీలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య జానకి, ఇద్దరు కుమారులు చైత్ర, వంశీకృష్ణ ఉన్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం మహాప్రస్థానంలో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. 1952 సెప్టెంబర్ 21న ఏపీలోని గుంటూరు జిల్లా వేమూరు మండలం వరహాపురం అగ్రహారంలో అనసూయ, సుబ్బారావు దంపతులకు జన్మించిన శ్రీరమణ అసలుపేరు కామరాజ రామారావు. కానీ ఆయన రచయిత శ్రీరమణగానే అందరికీసుపరిచితం.

ఏపీ సీఎం జగన్ సంతాపం

సాక్షి, అమరావతి: ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ శ్రీరమణ మృతిపట్ల ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన రాసిన కథలు మానవత్వం, విలువలతో కూడి ఉంటాయని జగన్ గుర్తుచేసుకున్నారు.

చమత్కార చక్రవర్తి

సాక్షి, హైదరాబాద్: సాహితీ ప్రపంచానికి సుపరిచితులైన శ్రీరమణ తెలుగులో పేరడీ రచయితగా సుప్రసిద్ధులు. అనేక మంది ప్రసిద్ధ రచయితల శైలిని అనుకరిస్తూ వందలకొద్దీ పేరడీలు రాసి స్వయంగా ఆయా రచయితల అభినందనలనూ పొందారు. అనేక పత్రికల్లో పేరడీలు, శ్రీకాలమ్, శ్రీచానెల్, చిలకల పందిరి, హాస్యజ్యోతి, మొగలిరేకులు వంటి ఎన్నో శీర్షికలు నిర్వహించారు. ఆయన మొదటి కథ వెలుగు తగ్గని వజ్రం 1970లలో ఆంధ్రప్రభలో వెలువడింది. ఆ తర్వాత బంగారు మురుగు పేరిట కథ రాశారు. మిథునం కథల సంపుటి ప్రచురించారు. ఆయన సినీ రంగంలో నూ పనిచేశారు. ఆంధ్రప్రభ, నవ్య వారపత్రికల కు సంపాదకులుగా, పత్రిక అనే మాసపత్రికకు గౌరవ సంపాదకుడిగా వ్యవహరించారు. హాస్యరచన విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం నుంచి 2014కిగాను కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు.

స్కూలు రోజుల్లోనే వ్యాసరచనలు...

ఆయన ప్రాథమిక విద్యను శ్రీరామ హిందూ ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేశారు. ఫస్ట్‌ఫారమ్‌లో అంటే హైస్కూలులో అడుగుపెట్టాలంటే నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణులై వేమురులోని కవిరాజా జిల్లా పరిషత్ హైస్కూలులో చేరారు. ఆ పాఠశాలలో ఎస్ఎస్ఎల్సీ దాకా చదివారు. స్కూలు రోజుల్లో రామకృష్ణ మిషన్ ఆశ్రమం స్వామి వివేకానందునిపై వ్యాసరచన పోటీ నిర్వహించగా శ్రీరమణ జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. అలా వరుసగా ఆరేళ్లపాటు ప్రథముడిగా నిలిచారు. పన్నెండేళ్ల వయసులో విజయవాడ ఆకాశవాణి నుంచి యువజనుల కార్యక్రమంలో ఆయన ఇంటర్వ్యూ వచ్చింది.

బాల్య స్మృతులతో మిథునం...

శ్రీరమణ తన మనసులో బాల్యం నుంచి నాటుకున్న ఆలోచనలకు అక్షరరూపంగా మిథునం కథా సంపుటిని రచించారు. ఇది ఎన్నో సంప్రదాయ కుటుంబాల కథ అని ఆయన చెప్పేవారు. దీన్ని చదివి ముచ్చటపడిన దర్శకుడు బాపు స్వదస్తూరిలో ఆ కథను రాసి శ్రీరమణకు పంపారు. అమెరికాలో స్థిరపడిన ప్రముఖ సైకియాట్రిస్ట్, తెలుగు భాషాభిమాని, సాహితీప్రియుడైన డాక్టర్ వి. జంపాల చౌదరి ఆ దస్తూరితోనే మిథునం కథను ప్రచురించి ఇప్పటికి 4 లక్షల మందికి అందచేశారు.

శ్రీరమణగా పేరు మార్పు..

తాతకు మగ పిల్లలు లేకపోవడంతో పీయూసీ చదివే రోజుల్లో శ్రీరమణను ఆయన దత్తత తీసుకున్నారు. శ్రీరమణ జన్మనామం వంకమామిడి రాధాకృష్ణ కాగా, దత్తత వెళ్లాక కామరాజు రామారావుగా మార్చుకున్నారు. అయితే ఈ పేర్ల తికమక నుంచి బయటపడేందుకు తన పేరును శ్రీరమణగా మార్చుకున్నారు.

ఆ 187 మందిని విధుల్లోకి తీసుకోండి : హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 2018లో తొలగించిన 108 అంబులెన్స్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వీరి తొలగింపు సహజ న్యాయ సూత్రాలను, సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. 8 వారాల్లోగా వారిని విధుల్లోకి తీసుకోవాలని తేల్చిచెప్పింది. ప్రభుత్వం, జీవీకే సంస్థ సంయుక్తంగా రాష్ట్రంలో 108 అంబులెన్స్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే తమ పని గంటలను 12 నుంచి 8 గంటలకు తగ్గించాలని 108 అంబులెన్స్ సిబ్బంది 2018, ఆగస్టులో ఆందోళన చేశారు. దీంతో ప్రభుత్వం 947 మంది సిబ్బందిని తొలగించింది. చట్టవిరుద్ధంగా తమను తొలగించడాన్ని సవాల్ చేస్తూ 2018లోనే ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. తొలగింపు చట్టవిరుద్ధమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయినా 187 మందిని మాత్రం విధుల్లోకి తీసుకోలేదు. దీనిపై వారు కోర్టు ధిక్కరణ పిటిషన్ కూడా దాఖలు చేశారు.

కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

దేవరకద్ర: మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని నాలుగు మండలాల పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరందించే కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతోంది. రెండు వారాలుగా జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో ఉంద్యాల పంప్‌హౌస్ ఫేజ్-1 నుంచి ఒక మోటారు రన్ చేసి నీటిని పంపింగ్ చేస్తుండగా.. మరికల్ సమీపంలోని ఫేజ్-2 వద్దకు చేరుతున్న నీటిని అక్కడ ఒక పంపును రన్ చేసి కోయిల్‌సాగర్‌కు నీటిని తరలిస్తున్నారు. దీంతో ఇటీవల ప్రాజెక్టులో 9.6 అడుగులుగా ఉన్న నీటిమట్టం బుధవారం సాయంత్రం వరకు 15 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులు కాగా.. మరో 17.6 అడుగులు చేరితే నిండే అవకాశం ఉంది. ప్రాజెక్టు పాత అలుగు స్థాయి 26.6 అడుగులుగా కాగా.. ఆ మేరకు నీటిమట్టం పెరిగినా సాగునీటిని వదులుతారు. ఇక ఎగువ నుంచి జూరాలకు వరద నీరు వస్తే ఎత్తిపోతల రెండు పంపులను రన్ చేస్తామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

చెన్నైకి పీయూ విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ సోషల్ వర్క్ చివరి సంవత్సరం విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా చెన్నైకి వెళ్లారు. క్రిష్టియన్ మిషన్ చారిటబుల్ ట్రస్ట్‌ను సందర్శించారు. సంస్థ ప్రతినిధి ప్రభాకరన్ వివిధ అంశాలను విద్యార్థులకు వివరించారు. వారి వెంట అధ్యాపకులు పర్వతాలు, మాధురి మోహన్ ఉన్నారు.

హైకోర్టు తీర్పు పేదల విజయం

- హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్



మాట్లాడుతున్నహైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి చంద్రకుమార్

నారాయణపేట: జిల్లాకేంద్రంలోని మైనార్టీకాలనీ, చిట్టెం నర్సిరెడ్డికాలనీ వాసుల ప్లాట్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు పేదల విజయమని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. బుధవారం ఆయా కాలనీవాసులు గృహలక్ష్మి పథకం అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ నుంచి సత్యనారాయణ చౌరస్తా మీదుగా మెట్రోగార్డెన్ వరకు అరుణోదయ కళాకారుల డప్పుల దరువుతో భారీ ర్యాలీ నిర్వహించారు. మెట్రో గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సంఘం డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం పట్టణంలోని సర్వేనంబర్ 67ను భూయాజమానుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మైనార్టీకాలనీలో 500 మందికి, సర్వేనంబర్ 48 చిట్టెం నర్సిరెడ్డికాలనీలో 508 మందికి, ఊట్కూర్ మండలం వల్లంపల్లి శివారులోని భూమిని లేఅవుట్ చేసి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టా సర్టిఫికేట్లు పంపిణీ చేసిందన్నారు. మైనార్టీకాలనీ పేదలకు 2005లో పట్టణ గృహ నిర్మాణం పథకం కింద, చిట్టెం నర్సిరెడ్డి కాలనీవాసులకు 2008లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకం ఫేస్-1 కింద ఇళ్ల మంజూరు చేసి ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల ప్రారంభించి రోడ్డు, విద్యుత్ లైన్, బోరు వేసిందని.. నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటంతో జీవనం సాగించలేని పరిస్థితి ఉందని తెలిపారు. నేటికీ మైనార్టీకాలనీలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లు దర్శనమిస్తాయని.. చిట్టెం నర్సిరెడ్డికాలనీలో నిర్మాణాలను కూల్చివేయడం సరైంది కాదన్నారు. తెలంగాణ ఏర్పాటైతే డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించుకోవచ్చని కేసీఆర్ చెప్పడంతో సంబరపడ్డారని.. ఇచ్చిన స్థలాలను లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటై పదేళ్లు కావస్తున్నా నేటికీ పేదోడి సొంతింటి కల నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పేదలకు న్యాయం చేయడమే లక్ష్యం..

పేదలకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని హైకోర్టు న్యాయవాది నంబి కృష్ణ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట 11 రోజులుగా రిలే దీక్షలు చేసిన పేదల కష్టాలు చూసి అండగా నిలువాలనుకొని హైకోర్టులో అప్పీలు చేసినట్లు తెలిపారు. హైకోర్టులో ప్రభుత్వం పట్టాదారులకు వ్యతిరేకంగా తమ వాదనలు వినిపించినా నిలువలేదన్నారు. 2023, జూన్ 5న పేదలకు అనుకూలంగా హైకోర్టు తీర్పునిచ్చిందని తెలిపారు. మైనార్టీకాలనీ, చిట్టెం నర్సిరెడ్డి కాలనీలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, గృహలక్ష్మి పథకాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకులు ఎం.కృష్ణ, హన్మేష్, జిల్లా కారదర్శి బి.రాము, న్యాయవాది ఎం.కాలేశ్వర్, నాయకులు యాదగిరి, సలీం, కెంచె నారాయణ పాల్గొన్నారు.

రైల్వేలో ఖాళీలను భర్తీ చేయాలి

- ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ సెక్రటరీ కేవీఆర్ ప్రసాద్



మాట్లాడుతున్న కేవీఆర్ ప్రసాద్

స్టేషన్ మహబూబ్‌నగర్: రైల్వేలో నూతన పింఛన్ విధానాన్ని తీసివేసి పాత విధానాన్ని అమలు చేయాలని సౌత్‌సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ హైదరాబాద్ డివిజనల్ సెక్రటరీ కేవీఆర్ ప్రసాద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయ ఆవరణలో బుధవారం సంఘ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల్లో పని ఒత్తిడి పెరిగిందని, అన్ని కేటగిరీల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కోరారు. సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పూర్తయిందని, ఈ మేరకు డబుల్ లైన్ ప్రకారం ఉద్యోగులను భర్తీ చేయాలని, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్‌ను ఆపాలన్నారు. జాతీయ స్థాయిలో ఎన్ఎఫ్ఐఆర్‌లో 9 లక్షల మంది సభ్యులుగా ఉన్నామని చెప్పారు. ఎంప్లాయిస్ సంఘ్‌ను బలోపేతం చేయాలని సూచించారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంప్లాయిస్ సంఘం అగ్రనేత మర్రి రాఘవయ్య నేతృత్వంలో వచ్చేనెల 10న ఢిల్లీలోని పార్లమెంట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు, బ్రాంచీ నుంచి పది మంది ఉద్యోగులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కొత్తగా ఎన్నికైన ఎంప్లాయిస్ సంఘ్ మహబూబ్‌నగర్ బ్రాంచీ సభ్యులను సన్మానించారు. సమావేశంలో ఎంప్లాయిస్ సంఘ్ హైదరాబాద్ డివిజనల్ అధ్యక్షుడు కత్తి సుదర్శన్, డిప్యూటీ డివిజనల్ సెక్రటరీ సాయిబాబ, సీసీఎస్ డైరెక్టర్ శ్రీధర్, బ్రాంచీ కార్యదర్శి భాస్కర్‌యాదవ్, చైర్మన్ శ్రీనివాసులు, వర్కింగ్ చైర్మన్ రవికిరణ్, వైస్ చైర్మన్లు సి.వెంకటేశ్, రాజు, శివశంకర్, సహాయ కార్యదర్శులు మోహన్, వెంకటస్వామి, సింహాచలం, కోశాధికారి కె.రాములు, రిటైర్డ్ ఉద్యోగులు బాలస్వామి, ఎస్కే పీరాన్, పుష్పరాజ్ పాల్గొన్నారు.

నేటినుంచి మొహర్రం ప్రారంభం



పాతపాలమూరులో పీర్ల మసీదు

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు సంప్రదాయంగా పాటించే ఇస్లామిక్ సంవత్సరం గురువారం నుంచి ప్రారంభం కానుంది. బుధవారం రాత్రి ఆషుర్‌ఖానాల్లో (మసీదులు) పీర్లను ప్రతిష్ఠించారు. ముస్లిం మతస్తుల హిజరీ కం1445వ సంవత్సరానికి చేరుకుంది. చాంద్రమానం ప్రకారం ఇస్లామిక్ క్యాలెండర్ మొహర్రం 1ని సంవత్సరాదిగా లెక్కించడం ఆనవాయితీగా వస్తుంది. మహ్మద్ ప్రవక్త మనుమలు ఇమామె హసన్, హుసేన్ తదితరులు ఇస్లాం ధర్మాన్ని కాపాడడానికి చేసిన యుద్ధంలో మృతిచెందారని ముస్లింలు మొహరం మాసమంతా విషాదాన్ని పాటిస్తారు. వారి పేరున దానధర్మాలు చేయడం, ఉపవాసాలు పాటించడం లాంటి ధార్మిక కార్యక్రమాలు చేపడుతారు.

గ్రామాల్లో పీర్ల పండుగ

ఈ మాసంలో పీర్ల పండుగ వేడుకలు ప్రారంభమవుతాయి. మొహర్రం మాసపు నెలవంకను చూసిన అనంతరం పీర్ల పెట్టెలను కిందకి దింపుతారు. మసీదులు, అషుర్ ఖానాల్లో మరుసటి రోజున పీర్లను ప్రతిష్ఠించి, వాటి ముందు అలాయ్ గుంతలను తవ్వి రాత్రివేళలో సంప్రదాయ రీతుల్లో ఆటపాటలు ప్రదర్శిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆడబిడ్డలను, బంధుమిత్రులను ఈ పండుగకు పిలిచి కందూర్లు చేస్తారు. ఈ సందర్భంగా కొన్నిచోట్ల జాతర్లు జరిపి హిందూముస్లింలు పరస్పర సోదరభావాన్ని చాటుతారు. జిల్లాలోని కోయిలకొండలో పండుగకు ప్రత్యేకత ఉంది. హైదరాబాద్, కర్ణాటక, రాయిచూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కలు తీర్చుకుంటారు. జిల్లాకేంద్రంతోపాటు పట్టణాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడుపుతారు.

ఉల్లి ధరకు రెక్కలు

- గరిష్టంగా రూ.2,140.. కనిష్టంగా రూ.1,800



దేవరకద్ర: ఉల్లి ధరలకు రెక్కలొచ్చాయి. ఒకపక్క టమాట ధర వింటే నోట మాట రాని పరిస్థితి నెలకొనగా.. పచ్చిమిర్చి ధర కారంతో ఘాటెక్కింది. ఇప్పటికే కూరగాయల ధరలు పెరిగి సామాన్యుడు అల్లాడిపోతున్నాడు. జూన్ చివరి వరకు రూ.వెయ్యి నుంచి రూ.1,200 వరకు క్వింటాల్ ధర పలికిన ఉల్లి ఈ నెల మొదటి వారం నుంచి పెరుగుతూ వస్తున్నాయి. మొదట్లో క్వింటాల్ ధర గరిష్టంగా రూ.1,400 పలకగా.. రెండో వారంలో రూ.1,800 వరకు పెరిగి.. ఈ వారం ఏకంగా రూ.2,140కి చేరింది. వరుసగా మూడు వారాల నుంచి ఉల్లిధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. జనవరి నుంచి ఆరునెలల పాటు ఉల్లి సీజన్ ఉండగా ధరలు మాత్రం రూ.వెయ్యికి అటు.. ఇటుగానే పలికాయి. ప్రస్తుతం సీజన్ లేకపోవడం, రైతులు నిల్వ చేసుకున్న ఉల్లిని మార్కెట్‌కు అరకొరగా తెస్తున్నారు. ఉల్లి దిగుబడులు లేని సమయంలో ధరలు రెండింతలు పెరిగాయి.

45 కిలోల బస్తా రూ.1,100..

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం జరిగిన ఉల్లి వేలంలో క్వింటాల్ ధర గరిష్ఠంగా రూ.2,140 పలకగా.. కనిష్ఠంగా రూ.1,800 వరకు ధర వచ్చింది. 45 కిలోల బస్తా గరిష్ఠంగా రూ.1,100 నుంచి కనిష్ఠంగా రూ.900 వరకు విక్రయించారు. మార్కెట్‌కు దాదాపు 200 బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. తూకాల అనంతరం ఉల్లి బస్తాల వ్యాపారం జోరుగా సాగడంతో మధ్యాహ్నం వరకే అమ్మకాలు పూర్తయ్యాయి. ఇక స్థానిక సంతలో చిరు వ్యాపారులు కిలో ఉల్లి రూ.20- 25 వరకు విక్రయించారు.

తాగిన మత్తులో కన్న కొడుకును అమ్మిన తండ్రి



బాలుడిని శిశు గృహ సిబ్బందికి అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

- అధికారుల జోక్యంతో బాలుడు శిశు గృహకు తరలింపు

అమ్రాబాద్: తాగిన మత్తులో డబ్బుల కోసం ఓ కసాయి తండ్రి కొడుకు (ఆరు నెలల బాలుడు)ని తల్లికి తెలియకుండా అమ్మిన ఉదంతం నాగర్‌కర్నూల్ పదరలో బుధవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం.. పదర మండల కేంద్రానికి చెందిన నల్లబోతుల మల్లయ్య, ముత్యాలమ్మ చెంచు దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. అయితే భార్యకు తెలియకుండా మల్లయ్య తాగిన మత్తులో తమ నాలుగు నెలల చిన్న కుమారుడిని మంగళవారం ఉదయం అమ్రాబాద్‌కు తీసుకెళ్లి మధ్యవర్తుల సహకారంతో ఇతరులకు అమ్మేశాడు. బాలుడిని రూ.50 వేలకు విక్రయించేందుకు మండలంలోని ఓ పీహెచ్‌సీకి చెందిన వైద్య సిబ్బంది సహకరించినట్లు తెలిసింది. కాగా.. బాలుడిని అమ్మేసి ఇంటికి వచ్చిన మల్లయ్యను భార్య ముత్యాలమ్మ కొడుకు ఎక్కడ అని నిలదీసింది. భర్త మాటలపై అనుమానం వచ్చి విషయాన్ని తమ తల్లిదండ్రులకు చెప్పడంతో వారి ద్వారా ఐసీడీఎస్, డీసీపీయూ సిబ్బందికి సమాచారం అందించారు. వారు పోలీసుల సహకారంతో మల్లయ్యను విచారించగా బాలుడిని అమ్మేసిన విషయం వెలుగుచూసింది. దీంతో అధికారులు అప్రమత్తమై ఆమనగల్ వద్ద బాలుడిని తీసుకెళ్తున్న వారిని అదుపులోకి తీసుకొని బాలుడిని స్వాధీనం చేసుకొని మహబూబ్‌నగర్‌లోని శిశు గృహానికి తరలించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి, పోలీసులు తెలిపారు. పదర, అమ్రాబాద్ ఎస్ఐలు తిరుపతి రెడ్డి, వీరబాబు, ఐసీడీఎస్ సీడీపీఓ దమయంతి, డీసీపీయూ సిబ్బంది సృజన పాల్గొన్నారు.

8 మంది ఎస్ఐల బదిలీ

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో పని చేస్తున్న ఎనిమిది మంది ఎస్ఐలను బుధవారం రాత్రి జోగుళాంబ గద్వాల 7వ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహన్ బదిలీ చేశారు.

ఎస్ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.మహేందర్	అలంపూర్	నాగర్‌కర్నూల్
ఎం.రమేష్	ఉట్కూర్	అలంపూర్
పి.విజయ్‌భాస్కర్	మూసాపేట వీఆర్,	మహబూబ్‌నగర్
కె.శ్రీనివాసులు	శాంతినగర్	మూసాపేట
బి.నరేష్	ఊర్కొండ	శాంతినగర్
డి.లెనిన్	జడ్చర్ల	ఊర్కొండ
వెంకటస్వామి	వీఆర్, వనపర్తి	శ్రీరంగాపూర్
వి.జయన్న	వీఆర్, వనపర్తి	ఎస్-2 వనపర్తి టౌన్

రామన్‌పాడులో 1,017 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,017 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.